క్లుప్తంగా

అర్హులైన బీడీ కార్మికులకు జీవన భృతి ఇవ్వాలి



ధర్పల్లి: అర్హులైన బీడీ కార్మికులకు రూ.4016 జీవనభృతిని ఆంక్షలు లేకుండా అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ధర్పల్లిలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) ఆధ్వర్యంలో బీడీ కార్మికులు ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రామకృష్ణ మాట్లాడుతూ.. బీడీ పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, కార్మికులకు ఉపాధి ప్రభుత్వమే కల్పించాలన్నారు. నాయకులు రమేష్, దామోదర్, అనీష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లను అందించాలి



నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలో ఇళ్లు లేని పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఇంటి వసతి కల్పించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పెద్ది వెంకట్రాములు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని నాగారం 80 క్వార్టర్స్‌లో గురువారం కాలనీ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ది వెంకట్రాములు హాజరై మాట్లాడారు. నాగారంలో ఎక్కువ సంఖ్యలో నిరుపేదలు, కూలీలు నివసిస్తున్నారన్నారు. ప్రభుత్వం వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. సుజాత, జ్యోతి, ఫిరంగిబాయి, సత్యశీల, శాలుబాయ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలపై ఫిర్యాదు

నిజామాబాద్‌అర్బన్: విద్యార్థులకు టీసీ ఇవ్వడానికి జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాల డబ్బులు డిమాండ్ చేసిందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఈమేరకు వారు గురువారం డీఈవో దుర్గాప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. లక్ష్మీ ప్రియనగర్‌కు చెందిన రమాదేవి పిల్లలు అకిరా నందన్ 8వ తరగతి, మనోజ్ఞ 10వ తరగతి మరో పాఠశాలకు వెళ్లేందుకు టీసీ ఇవ్వాలని దరఖాస్తు చేసుకోగా ఒక్కొక్కరికి రూ. 400చొప్పున డబ్బులు వసూలు చేసిన తర్వాతనే టీసీలు ఇచ్చారన్నారు. అలాగే పలువురు విద్యార్థులు అడ్మిషన్ రద్దు చేసుకున్నా, పాఠశాల యాజమాన్యం రిజిస్ట్రేషన్ ఫీజును ఇవ్వలేదని ఆరోపించారు.

కనీస పెన్షన్ రూ.5వేలకు పెంచాలి



నిజామాబాద్ రూరల్: కనీస పెన్షన్ రూ.5వేలకు పెంచాలని తెలంగాణ భారతీయ మజ్దూర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ కోరారు. దేశవ్యాప్త నిరసన కార్యక్రమాల్లో భాగంగా జాతీయ సంఘం పిలుపు మేరకు గురువారం నగరంలోని పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్ ప్రయివేట్ హాస్పిటల్లో వైద్యం అందేలా కల్పించాలన్నారు. ఈ నెల 30న జరిగే సబ్ కమిటీ సమావేశంలో కనీస పెన్షన్ రూ. 5వేలు ప్రకటించాలన్నారు. లేదంటే దేశవ్యాప్త ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. నాయకులు పెద్ది శివయ్య, దామోదర్, కంది కొండల్‌రెడ్డి, సత్యం తల్వార్ తదితరులు పాల్గొన్నారు

చెరువులు, కుంటలను రక్షించాలి



నిజామాబాద్‌నాగారం: జిల్లాలో ఆక్రమణకు గురైన చెరువులు, కుంటలను రక్షించాలని, ఇందుకోసం హైడ్రా మాదిరిగా జిల్లాలో నిడ్రాను ఏర్పాటు చేయాలని తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ బి కేశవులు కోరారు. ఈమేరకు గురువారం ఆయన జిల్లా అఖిల పక్షం తరపున కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కేశవులు మాట్లాడుతూ.. జిల్లాలో చెరువు శిఖాలు, కాల్వల బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపడుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఆక్రమణలపై సర్వే చేసి, కబ్జాలను స్వాధీనం చేసుకోవాలన్నారు. నాయకులు వెంకట్రాములు, దండి వెంకట్, సుధాకర్, వేమయ్య, అంకం జగదీష్, తూటికూర నర్సయ్య, అశోక్‌గౌడ్, డీఎల్ఎన్ చారి, సురేష్ పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందజేత

మాక్లూర్: పోషణ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ– 3లో పిల్లలకు పౌష్టిక ఆహారం అందించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ఓటరు జాబితాలో తప్పులుంటే చర్యలు



మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అబ్దుల్ హమీద్

నిజామాబాద్ సిటీ : ఓటరు జాబితాలో తప్పులుంటే చర్యలు తప్పవని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి పరిశీలకులుగా విచ్చేసిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటరు జాబితాలో సవరణలు చేస్తూ, ఇంటింటి సర్వేను తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని బీఎల్‌వోలకు, మున్సిపల్ ఎన్నికల సిబ్బందికి సూచించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ కమిషనర్ మంద మకరందు అధ్యక్షతన ఓటరు జాబితా తయారీపై ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బీఎల్‌వోలను క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను హమీద్ అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితా ప్రతి ఓటరుకు చేర్చాల్సిన బాధ్యత బీఎల్‌వోలదేనని స్పష్టం చేశారు. ఓటరు జాబితా తీసుకుని ఇంటింటి పరిశీలన చేయాలన్నారు. జాబితాలో తప్పులుంటే సవరణలు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారిగా విచారణ చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే అధికారులైనా, సిబ్బంది అయినా వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌బూత్‌ల నిర్వహణ సరిగా చేయని ఇద్దరు తహసీల్దార్లను సస్పెండ్ చేసిన విషయం గుర్తుచేశారు. వారు ఇప్పటికీ ఇంకా విధుల్లో చేరలేదని తెలిపారు. మళ్లీ ఒకసారి వచ్చి రివ్యూ చేస్తానని ఆ సమయంలో తప్పులు జరిగితే చర్యలు తీసుకోవడానికి వెనుకాడనని హెచ్చరించారు. ఎవరూ తప్పులు చేయవద్దని సూచించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని, ఎలక్టోరల్‌రోల్ తప్పులు లేకుండా చూసుకోవాలని, షెడ్యూల్ లోపు వివరాలు పూర్తిచేయాలని తెలిపారు. మేనేజర్ జనార్దన్, ఈఆర్‌వోలు, ఎన్నికల సిబ్బంది తదితరులు ఉన్నారు.

రాహుల్‌గాంధీ హత్యకు బీజేపీ నేతల కుట్ర

- పోలీసులకు ఫిర్యాదు చేస్తాం
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఖలీల్‌వాడి: రాహుల్‌గాంధీ హత్యకు బీజేపీ నేతలు కుట్ర పన్నుతున్నారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. ఈనెల 11నుంచి 15వరకు ఇద్దరు రాజ్యసభ సభ్యులు, ఇద్దరు ఎమ్మెల్యేలు, ఓ సహాయ మంత్రి రాహుల్‌గాంధీపై అనవసరంగా వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. రాహుల్‌గాంధీపై మాట్లాడిన వారిపై కేసులు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. దీనిపై నిజామాబాద్‌లోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయగా, సీపీతోపాటు డీజీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు.

గల్ఫ్ దేశాలలో కార్మికులు మృతి చెందితే రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా..

తెలంగాణ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా గల్ఫ్ కార్మికులు గల్ఫ్‌దేశాలలో మృతి చెందితే రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని భూపతిరెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం నుంచి ఇప్పటి వరకు 150 మంది కార్మికులు మృతి చెందారని వారందరికీ రూ. 5లక్షలు అందిస్తామన్నారు. సచివాలయం వద్ద ప్రవాసీ ప్రజావాణి ఏర్పాటు చేశామని, మంగళవారం, శుక్రవారం గల్ఫ్‌బాధితులు ఫిర్యాదులు చేసుకోవచ్చున్నారు. గల్ఫ్ నుంచి వచ్చి ఉపాధి లేని వారికి ఆర్థిక భరోసా కల్పిస్తామని చెప్పారు. నాయకులు శేఖర్‌గౌడ్, ముప్పాగంగారెడ్డి, బోర్గాం శ్రీనివాస్, రాజేంధర్, నవీన్‌గౌడ్, నరేష్, ప్రవీణ్, శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితాను సరిచూసుకోవాలి





సిరికొండలో మాట్లాడుతున్న ఎంపీడీవో మనోహర్‌రెడ్డి.. డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న అధికారులు

సిరికొండ: గ్రామాల్లో ప్రదర్శించిన ఓటరు జాబితాను సరిచూసుకోగలరని ఎంపీడీవో మనోహర్ రెడ్డి సూచించారు. సిరికొండ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన ఓటరు జాబితా ముసాయిదాపై రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో పేర్లు సరిగా ఉన్నాయో లేవో, ఇంటిలోని అందరి పేర్లు ఒకే వార్డులో ఉన్నాయా వేరే చోట ఉన్నాయో సరిచూసుకోవాలన్నారు. చనిపోయిన వారి పేర్లు ఉంటే తెలపాలని జాబితా నుంచి తొలగిస్తామన్నారు. వివిధ పార్టీల నాయకులు బాకారం రవి, శ్రీనివాస్, ఎర్రన్న, భాస్కర్, గంగారెడ్డి, మహేంధర్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లిలో..

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో రవీందర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన వార్డుల వారీగా ఓటరు జాబితాను పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. జాబితాలో ఏమైన మార్పులుచేర్పులు ఉంటే సరిచేయలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, ఉపాధిహామీ ఏపీవో మంజుల, పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి





గూపన్‌పల్లిలో రోడ్లను శుభ్రం చేస్తున్న అధికారులు.. మోపాల్‌లో ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

నిజామాబాద్ రూరల్: ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని మున్సిపల్ అడిషనల్ కమిషనర్ శంకర్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం 3వ డివిజన్ పరిధిలోగల గూపన్‌పల్లిలో స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో శంకర్ పాల్గొని, పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వ్యాధులు దరిచేరకుండ పరిసరాలను నిత్యం శుభ్రం చేయాలని కార్మికులకు సూచించారు. అంతకుముందు గూపన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ నిర్వహించి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ యూనిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు పరిసరాలను శుభ్రం చేశారు. అధికారులు కుమారస్వామి, ప్రభాకర్, రాంచందర్, ప్రవీణ్‌కుమార్, అజయ్, దేవదాస్ పాల్గొన్నారు.

మోపాల్: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రజలతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. శ్రమదాన కార్యక్రమాలు చేపట్టారు. నర్సింగ్‌పల్లి గ్రామంలో ఎంపీడీవో రాములు నాయక్ ప్రజలు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌అర్బన్: అర్సపల్లి ప్రభుత్వ పాఠశాలలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సైతం ర్యాలీ నిర్వహించారు. సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





అర్సపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు .. ధర్పల్లి మండల కేంద్రంలో..

త్వరలో అందుబాటులోకి ఇంజినీరింగ్ కళాశాల



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌కు ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీకి రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని, దీంతో త్వరలో కళాశాల అందుబాటులోకి రానున్నట్లు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో క్రీడా ప్రాంగణంను రెండు వారాల లో సీఎం రేవంత్‌రెడ్డి చేత ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీపై బీజేపీ నాయకులు ప్రొటోకాల్ గురించి మాట్లాడటం సరికాదన్నారు. బీజేపీ నేతలు విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తే తగిన గుణపాఠం చెబుతామన్నారు. నాయకులు రామర్తి గోపి, ప్రీతమ్, వైశాఖ సంతోష్, బోర్గాం శ్రీనివాస్, సుభాష్ జాదవ్ పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ఇల్లు పరిశీలన



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మంచిప్ప గ్రామంలో శిథిలావస్థకు చేరిన ఇంటిని గురువారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీవో కిరణ్‌కుమార్ పరిశీలించారు. గ్రామానికి చెందిన బీపీఎం అశోక్ ఇల్లు గతేడాది సగం కూలిపోయింది. ఆ ఇంట్లోనే అశోక్ పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఈవిషయమై గతంలో పంచాయతీ సెక్రెటరీ నోటీసులు ఇచ్చినా ఇంటి యజమాని స్పందించలేదు. దీంతో గ్రామస్తులు కలెక్టరేట్‌లో ప్రజావాణికి ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీవో ఇంటిని పరిశీలించి, యజమానితో మాట్లాడారు. సోమవారం లోపు ఇంటిని మొత్తం తొలగిస్తానని గడువు కోరినట్లు ఎంపీవో తెలిపారు. లేకుంటే పంచాయతీ కార్యాలయం నుంచి తొలగిస్తామని స్పష్టంచేశారు.

చదువుతోపాటు క్రీడలలో రాణించాలి



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. బినోల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టి నూతన నియామకాలు చేపడుతుందని పేర్కొన్నారు. పాఠశాలలు, వసతి గృహాలలో మౌలిక వసతుల కల్పనకు విశేషంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను గౌరవించాలని, పిల్లలను మందలిస్తే ఉపాధ్యాయులను నిలదీయొద్దని తల్లిదండ్రులకు సూచించారు. వరి పంటకు సోకిన రోగాలపై శాస్త్రవేత్తలతో పరీక్షలు జరిపేందుకు కృషి చేస్తున్నామని, రైతులు సహకరించాలని సూచించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, డీఈవో దుర్గా ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గడుగు గంగాధర్, నగేష్‌రెడ్డి, పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శ్రీనివాస్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన జిల్లా నాయకులు



నిజామాబాద్ నాగారం/ఖలీల్‌వాడి: టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను గురువారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఐఎన్‌టీయూసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. నాయకులు ఎడ్ల నాగరాజు, పూజారి గంగాధర్, వేణుగోపాల్, శ్రీనివాస్, కార్తీక ఉన్నారు. అలాగే జిల్లా కాంగ్రెస్ మహిళా నేతలు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, రేవతి, సుజాత, కావేరి, పద్మ, అపర్ణ పాల్గొన్నారు



సమస్యల పరిష్కారమే వేదిక లక్ష్యం

రుద్రూర్: విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్) లక్ష్యమని జిల్లా సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఈ. నారాయణ అన్నారు. మండల కేంద్రంలో పరిష్కార వేదిక కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేశారు. వేదిక దృష్టికి నాలుగు సమస్యలు రాగా మూడింటిని వెంటనే పరిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల గురించి నేరుగా లేదా ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. అలాగే రైతులు మోటార్ల వద్ద కెపాసిటర్లు అమర్చుకోవాలని, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సమస్యలు ఏర్పడితే సంబంధిత అధికారి దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. సీజీఆర్ఎఫ్ టెక్నికల్ మెంబర్ ఎస్. రామకృష్ణ, ఫైనాన్స్ మెంబర్ ఎల్.కిషన్, ఇండిపెండెంట్ మెంబర్ ఎం.రాజాగౌడ్, డీఈ ముక్తార్, ఏడీ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

రాష్ట్ర అవార్డు గ్రహీతకు సన్మానం



తెయూ: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత తెయూ అసోసియేట్ ప్రొఫెసర్ సుధాకర్‌గౌడ్‌ను గురువారం తెయూలో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ యూనివర్సిటీ(ఏటీయుటీ) ఆధ్వర్యంలో సన్మానించారు. రిజిస్ట్రార్ యాదగిరి, చంద్రశేఖర్, అపర్ణ, రవీందర్‌రెడ్డి, రాంబాబు, సంపత్‌కుమార్, అతిక్, లావణ్య, శాంతాబాయి, వాణి తదితరులున్నారు.

ఓటరు జాబితాపై సమావేశం



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ పార్టీల నాయకులతో ముసాయిదా ఓటరు జాబితాపై ఎంపీడీవో సతీష్ కుమార్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఓటరు జాబితా సవరణపై చర్చించారు. ఎంపీవో యూసుఫ్‌ఖాన్, వివిధ పార్టీల నేతలు చిన్నారెడ్డి, నట్ట బోజన్న, శ్రీనివాస్‌గౌడ్, దీకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి



జక్రాన్‌పల్లి: రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని రైతు ఐక్య కార్యాచరణ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు గురువారం తహసీల్దార్ కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. నాయకులు నట్ట బోజన్న, దీకొండ శ్రీనివాస్, చింత మహేష్, అప్పాల అరుణ్, శ్రీనివాస్‌గౌడ్, జైడి భాస్కర్, నితిన్‌రెడ్డి, చెన్న కేశవులు, వసంత్, పిప్పెర గంగాధర్ ఉన్నారు.

రైతుల అక్రమ అరెస్టులను ఆపండి



నిజామాబాద్ రూరల్: రైతుల అక్రమ అరెస్టులను వెంటనే ఆపివేయాలని జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్న గారి విఠల్‌రావు ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని, అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

ఆర్మూర్‌టౌన్: ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. ఆర్మూర్ పట్టణంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పలు దుకాణాల్లో ప్లాస్టిక్ వినియోగం చవద్దని అవగాహన కల్పించారు. అలాగే నిమజ్జనంలో భాగంగా గూండ్లచెరువులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యవర్థాలను తొలగించారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	75,900	వెండి (కిలో)	91,000
22 క్యారెట్స్	69,097		


\- నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	28	50	గాజరుగడ్డ	40	70
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	25	50
బీరకాయ	50	80	దోసకాయ	25	50
దొండ	40	60	ఆలుగడ్డ	30	50
బీర్నిసు	60	90	గోబిగడ్డ	20	40
కాకర	40	80	గోబిపువ్వు	50	75
వంకాయ	30	60	బీట్‌రూట్	30	50
పాలకూర	70	110	కరివేపాకు	40	60
మెంతికూర	90	140	చామగడ్డ	40	60
కొత్తిమీర	80	120	గోరుచిక్కుడు	30	50
పుదీనా	80	120	చిక్కుడుకాయ	70	100
క్యాప్సికం	50	75			

\- సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	35: చిన్నకథ కాదు (తెలుగు)-4.30, మత్తు వదలరా(తెలుగు)- 7.20 10.25
స్క్రీన్-2	సరిపోదా శనివారం (తెలుగు) - 1.30 7.25
స్క్రీన్-3	ట్రాన్స్‌ఫార్మర్స్ (ఇంగ్లీష్ 3డీ) - 11.00, 4.40, 10.35, ప్రేమనగర్ (తెలుగు) - 7.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఫైలం పిలగా(తెలుగు)-1.15, మత్తు వదలరా-2 (తెలుగు) - 4.00, 7.00, 10.00
స్క్రీన్-2	ట్రాన్స్‌ఫార్మర్స్ వన్(3డీ ఇంగ్లీష్) - 11.00, 4.35, యుద్ధ (హిందీ) - 1.30, 7.05, స్త్రీ - 2 (హిందీ) - 10.10
స్క్రీన్-3	35 : మత్తువదలరా-2 -1.15, సరిపోదా శనివారం - 4.15 10.30, తుంబడ్ (హిందీ) - 7.50
స్క్రీన్ -4	దిక్కెట్స్ (తెలుగు)-9.55, తుంబడ్(హిందీ) - 12.35, యుద్ధ(హిందీ)-3.15, ప్రేమాభిషేకం-6.20, ప్రేమనగర్(తెలుగు)-10.10
లలితామహల్	సరిపోదా శనివారం (తెలుగు)
దేవి	మత్తు వదలరా-2 (తెలుగు)
నటరాజ్	యుద్ధ (హిందీ)
విజయ్	ఎ.ఆర్.ఎం 3డీ (తెలుగు)

ప్రశాంతంగా వినాయకుల నిమజ్జనం



ధర్పల్లి: మండల కేంద్రంతోపాటు సీతాయిపేట్, దుబ్బాక గ్రామంలో గురువారం వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా కొనసాగింది. శోభాయాత్రలో యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విగ్రహాలను స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.